క్లుప్తంగా

నేడు స్పందన

చిత్తూరు రూరల్: తమ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మురళీమోహన్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

నాగావాండ్లపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష రేపు

ఐరాల: మండలంలోని నాగావాండ్లపల్లె సచివాలయ పరిధిలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు నిర్వహించే శిబిరంలో రోగులకు అన్ని విభాగాల వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామంలో స్పెషలిస్టు వైద్యులు వస్తున్నారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా చంద్ర



రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరాయుడుతో బి.చంద్ర

పూతలపట్టు: చిత్తూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడిగా పూతలపట్టు మండలం తేనేపల్లి పంచాయతీకి చెందిన బి.చంద్ర నియమితులయ్యారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర అధ్యక్షుడు లాక వెంగళరాయ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర యాదవ్, జాతీయ కన్వీనర్ నాగేశ్వరరావు, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ ప్రసన్న, పూతలపట్టు నియోజకవర్గ అధ్యక్షుడు కోదండ, తవణంపల్లి అధ్యక్షుడు పూర్ణచంద్ర, పూతలపట్టు మండల అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షులు పెరుమాళ్, సుదర్శన్, రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



చెక్కును ఆలయ అధికారులకు అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి నిత్యాన్నదానానికి చిత్తూరు జిల్లా కొత్తకోటకు చెందిన దాత సుమన్ రూ.లక్ష చెక్కును ఆలయ అధికారులకు అందించారు. దాత కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి ఈ చెక్కును ఆలయ అధికారులకు అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ల ఆవిష్కరణ

చిత్తూరు కలెక్టరేట్: పీఆర్‌టీయూ (ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్) రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్లను డీఈఓ విజయేంద్రరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాశ్‌రెడ్డి, కణ్ణన్ ఉపాధ్యాయుల సమస్యలపై డీఈఓతో చర్చించారు. కార్యక్రమంలో పలువురు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

4న తిరుపతిలో బీసీల బహిరంగ సభ

తిరుపతి కల్చరల్: బీసీల ఆత్మగౌరవం కోసం, బీసీ యువత భవిష్యత్తు లక్ష్యంగా జాగ్వారు నుంచి చేపట్టిన మరో స్వాతంత్ర్య పోరాట రథయాత్ర ఫిబ్రవరి 4న తిరుపతిలో ముగియనున్న నేపథ్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాక వెంగళరాయుడు తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. అణచివేతకు గురవుతున్న బీసీలకు బాసటగా బీసీ ఆత్మగౌరవ యాత్రను, ప్రైవేటు రంగంలో బీసీలకు ప్రత్యేక రిజర్వేషన్లు డిమాండ్‌తో తిరుపతిలో భారీ బహిరంగ సభ చేపడుతున్నట్టు తెలిపారు. జాతీయ బీసీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూరానమ్మ, నాయకులు తుడక అమరనాథ్, జగన్నాథం, ప్రసన్న కుమార్, లక్ష్మణరావు, నారాయణస్వామి, దేవి పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనకు స్పందన

తిరుపతి సిటీ: భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో టీటీడీ సౌజన్యంతో శనివారం నుంచి ప్రారంభమైన పుస్తక ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. ఈ నెల 28వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగనుంది. ఆదివారం నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు పుస్తక ప్రదర్శనను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ జబువంటి పుస్తక ప్రదర్శన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ఎక్కువగా విద్యార్థులు, అభ్యర్థులు కొనుగోలు చేశారు.

కలసికట్టుగా పార్టీని గెలిపిద్దాం

- చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి
- గుడిపాలలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో సమావేశం



వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

గుడిపాల: రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కలసికట్టుగా పనిచేయాలని చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి కోరారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వారంలో ప్రతి బుధ, గురువారం మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబాలు పొందిన ప్రభుత్వ పథకాల లబ్ధిని తెలియజేయాలన్నారు. అభివృద్ధి ఫలాలు పొందిన ప్రజలు ఆశీర్వదించాలని కోరుతామన్నారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగిందని గర్వంగా ఇంటింటికీ వెళ్లి ఓటు అడిగే హక్కు తమకు ఉందన్నారు.

కుంభాభిషేకంలో విజయానందరెడ్డి

గుడిపాల: వినాయకస్వామి కుంభాభిషేకంలో చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి హాజరై పూజలు చేశారు. ఆదివారం స్థానిక వినాయకస్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 4గంటలకు వేదపారాయణం, కలశపూజ, విగ్రహప్రతిష్ఠ, గణపతి హోమం, మహా ప్రాణ ప్రతిష్ఠాపన, అష్టమంగళ దర్శనం, మహా పూర్ణాహుతి, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. ముఖ్యఅతిథి విజయానందరెడ్డికి వేదపండితులు ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీలు గోల్డ్ హరిప్రసాద్, యోవాన్, చిట్టిబాబు, గోపి, సర్పంచులు మధుసూదన్‌రెడ్డి, మధుసూదన రాయల్, నవీన్, రమేష్, రవిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్డెప్ప, కాలిమేగన్, రవియాదవ్, రాజా, సంపత్, రామురెడ్డి, క్రిష్ణమూర్తి యాదవ్, యుగంధర్, కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



కుంభాభిషేక కార్యక్రమంలో హారతి ఇస్తున్న విజయానందరెడ్డి

శ్రీరామ నామ సంకీర్తన



శ్రీరామసామగ్రి అందజేస్తున్న క్లబ్ సభ్యులు



అయోధ్య రామాలయం కరపత్రాలను చూపిస్తున్న భక్తులు

చిత్తూరు రూరల్: అయోధ్యలో నూతనంగా నిర్మించిన శ్రీరామ మందిరాన్ని, బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకుని వాసవిక్లబ్ చిత్తూరు గ్రేటర్ ఆధ్వర్యంలో నగరంలోని తపోవనం ఆశ్రమంలో ఆదివారం శ్రీరామ నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రారంభోత్సవాన్ని టీవీలలో వీక్షించాలని కోరారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు. అలాగే నిరాశ్రయుల వసతి గృహంలోని పిల్లలకు శ్రీరామసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అర్బన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆరూరు ప్రసాద్ బాబు, శరవణ, బైసాని బాబురావు, నాగేంద్ర, గోవర్ధన, మోహన్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రామభక్తుల పూజలు

గుడిపాల: మండలంలో సోమవారం 27 పంచాయతీలకు సంబంధించి అన్ని దేవాలయాల్లో అయోధ్య శ్రీరాముని ప్రత్యేక పూజలు చేయనున్నట్టు రామభక్తులు తెలిపారు. బాలరాముడు ప్రతిష్ఠ సందర్భంగా శ్రీరాముని పటం ఊరేగింపు, భజనలు చేయనున్నట్టు చెప్పారు. ఆదివారం సంగమంగళంలో ప్రత్యేకంగా రామభక్తులు పూజలు, భజనలు చేశారు.

ముస్లింల ఇస్తిమాకు సహకారం



ఇస్తిమా ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన ఫక్రుద్దీన్ షరీఫ్, ఆలీమ్‌బాషా

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: పుంగనూరులో ఈనెల 24, 25న నిర్వహించే ముస్లింల మైనారిటీల ఇస్తిమా కార్యక్రమానికి అన్ని విధాలా సహకారం అందిస్తామని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఇస్తిమా నిర్వహించనున్న ప్రాంతంలో చేస్తున్న ఏర్పాట్లను ముస్లింలతో కలసి ఆదివారం ఆయన పరిశీలించారు. ఇస్తిమా కార్యక్రమానికి మంచినీరు, విద్యుత్ వసతి అంతరాయం లేకుండా కల్పించాలని, అలాగే బందోబస్తు కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ముస్లింలు ఎంతో పవిత్రంగా నిర్వహించే మత బోధనలను శ్రద్ధగా ఆలకించి అల్లా బోధనల ప్రకారం జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ఎలాంటి అవసరం వచ్చినా ముస్లిం మైనారిటీలకు తనవంతు తోడ్పాటు ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, మైనారిటీ నాయకులు కిజర్‌ఖాన్, జబీవుద్, నూరుల్లా పాల్గొన్నారు.

25న పాలాభిషేక ఉత్సవం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్: శ్రీకాళ భైరవ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 25న నిర్వహించే పాలాభిషేక ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ట్రస్ట్ చైర్మన్ వెంకటేషన్ పిలుపునిచ్చారు. చిత్తూరు నగరంలోని ఈశ్వరగుడివీధిలోని శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పాలాభిషేక ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. వెంగళ్రాయకొండపై ఉన్న శ్రీ వళ్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామి దేవస్థానంలో 25న పాలకావళ్లతో ఊరేగింపుగా వెళ్లి ఉదయం 11 గంటలకు పాలాభిషేకం నిర్వహించనున్నట్టు చెప్పారు. అలాగే శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయంలో పాలాభిషేక కలశ స్థాపన చేస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

లెనిన్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న నాగరాజన్, భూపేష్

చిత్తూరు కార్పొరేషన్: కామ్రేడ్ లెనిన్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. లెనిన్ శతవర్ధంతి పురస్కరించుకుని ఆదివారం లెనిన్‌నగర్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా దివంగత మాజీ ఎమ్మెల్యే గోపినాథ్ తనయుడు వైఎస్సార్‌సీపీ నాయకుడు భూపేష్ పాల్గొని పుష్పాంజలి ఘటించారు. ఒకనాటి సోవియట్ యూనియన్‌లో శ్రామిక, కార్మిక, అట్టడుగు వర్గాల కోసం లెనిన్ కృషి చేశారని స్మరించారు. కార్యక్రమంలో నాయకులు మణి, విజయగౌరి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న టెట్రా ప్యాకెట్లు, స్కూటీ, నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పలమనేరు: అక్రమంగా తెస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్టు పలమనేరు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు..స్థానిక దండపల్లి రోడ్డుకు చెందిన అనిల్‌నాయుడు కర్ణాటక రాష్ట్రం నుంచి యమహా స్కూటీలో 192 టెట్రాప్యాకెట్లతో వస్తుండగా పోలీసులు ఆదివారం నాగమంగళం వద్ద అతడిని అరెస్ట్ చేశారు. టెట్రాప్యాకెట్లతోపాటు స్కూటీని సీజ్ చేశారు.

వైఎస్సార్ సీపీతోనే బ్రాహ్మణుల అభ్యున్నతి



బ్రాహ్మణ నూతన కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న రామమూర్తి

పుంగనూరు: అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బ్రాహ్మణుల అభ్యున్నతికి కూడా తోడ్పాటునిస్తోందని స్థానిక బ్రాహ్మణ సంఘ కార్యదర్శి రామమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం పుంగనూరులో బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కడా లేని విధంగా బ్రాహ్మణ కమ్యూనిటీ భవన నిర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.15లక్షల విలువ చేసే స్థలాన్ని కేటాయించిందని, ఇది మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి చొరవతోనే బ్రాహ్మణుల కల సాకారమైందన్నారు. వారికిప్పుడు బ్రాహ్మణ సమాజం యావత్తు రుణపడి ఉంటుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ బ్రాహ్మణుల అభివృద్ధికి దోహదం చేయలేదన్నారు. ఇబ్బందులకు పడుతున్న బ్రాహ్మణులను గుర్తించి ఆయన దిశగా తోడ్పాటుకు చర్యలు తీసుకోవడం మరువలేదన్నారు. రానున్న ఎన్నికల్లో తామంతా వైఎస్సార్ సీపీకి అండగా ఉంటామన్నారు. అనంతరం తహసీల్దార్ సీతారామన్, ఆర్ఐ ఫణీంద్రను సన్మానించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కృష్ణమూర్తి రావు, సురేంద్రరావు, శ్రీనాథ్‌రావు, సరస్వతమ్మ, రమణరావు, పవన్, శివం తదితరులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడిగా సురేంద్రరావు

నియోజకవర్గ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా సురేంద్రరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రామమూర్తి, ట్రెజరర్‌గా ఎస్.ఫణీంద్ర, ఉపాధ్యక్షులుగా డాక్టర్ రమణరావు, సుజాత, వెంకటప్రసాద్, సరస్వతమ్మ, గౌరవాధ్యక్షులుగా ఆర్‌కే రామకృష్ణను, గౌరవ అధ్యక్ష సలహాదారులుగా ఉదయ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులుగా సాయిపవన్, కృష్ణమూర్తి, శ్రీనాథరావు, మల్లికార్జునరావు, రాజేష్, గిరి, అశ్వర్థనారాయణ, సందీప్, మహేష్, ఉప్పలదడియం రాజేష్, పార్థసారథి, కృష్ణమూర్తి, వినోద్, రామమూర్తి ఎన్నికయ్యారు.

బోయకొండలో ధర్మ ప్రచార వారోత్సవాలు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం ధర్మ ప్రచార వారోత్సవాలను ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ప్రారంభించారు. దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రెడ్డెప్ప, మురళి వాయిద్య, భజన బృందం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించింది. భజన బృందం కార్యక్రమాలు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. అనంతరం తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు.

ఘనంగా కనుమ



రొంపిచెర్ల: సంక్రాంతి పండుగలో భాగంగా కనుమ పండుగను రొంపిచెర్ల గ్రామ పంచాయతీలో ఆదివారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు పిల్లలందరూ దల్ల ఎత్తుకుని వెళ్లి చెరువులు, బావుల్లో నిమజ్జనం చేశారు. అనంతరం పశువులను చెరువులో శుభ్రంగా కడిగి ప్రత్యేక అలంకరణ చేశారు. పశువు దేవర వద్దకు ఊరేగింపు తీసుకెళ్లి, సాయంత్రం చిట్టాకుప్పకు నిప్పు పెట్టి పశువులను బెదిరించారు. పశువుల దేవర వద్ద కాటమరాజుకు ప్రత్యేక పూజలు చేశారు. టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛ తీర్థ సేవ



పరిసరాలను శుభ్రం చేస్తున్న ఆలయ సిబ్బంది

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ పరిసరాలలో స్వచ్ఛ తీర్థ సేవా కార్యక్రమం కొనసాగుతోంది. స్వచ్ఛ తీర్థ సేవా కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం, దేవదాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు తొమ్మిది రోజుల పాటు ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాణిపాకం ఆలయ పరిసరాలను అధికారులు, సిబ్బంది ఆదివారం ఏడో రోజు 100 అడుగుల రహదారి, నూతన ఆర్చ్ నిర్మాణం దగ్గర శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు ఎస్‌వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ వాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తిరుమల గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే తత్వానికి మట్టి అద్దం దర్పణం



మట్టి అద్దం కవితా సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: సమకాలీన సామాజిక అంశాలు, తెలుగు భాష, సంస్కృతి, విద్య, ప్రకృతి, పర్యావరణం, కుటుంబ బంధాలు, మానవీ విలువల పతనంపై ప్రశ్నించే తత్వమే యువశ్రీ మురళి మట్టి అద్దం కవితా సంపుటి పుస్తకమని ఎస్వీయూ తెలుగు అధ్యయన శాఖ ఆచార్యులు రాజేశ్వరమ్మ తెలిపారు. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యాయ సంఘ నేత యువశ్రీ మురళి కవితా సంపుటి మట్టిఅద్దం పుస్తకావిష్కరణ సభ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం యూత్ హాస్టల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజేశ్వరమ్మ, శ్వేత భవన్ పూర్వ సంచాలకుడు భూమన్ పాల్గొని, మట్టి అద్దం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం భూమన్ మాట్లాడుతూ పల్లెటూరి మట్టి వాసనలకు మట్టి అద్దం కవితలు దర్పణం పడుతున్నాయన్నారు. పుస్తక సమీక్షకుడు, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు, తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజు, మన్నవ గంగాధరప్రసాద్, తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షురాలు గంగవరం శ్రీదేవి, గంటా మోహన్, శతావధాని ఆముదాల మురళి, సాహితీ వేత్తలు, రచయితలు తమటం రామచంద్రారెడ్డి, గుండువల్లి గోవిందయ్య, కటుకుటం రామమూర్తి, తోట వెంకటేశ్వర్లు, ఆకుల మల్లేశ్వరరావు, ఏడు కొండలు, మల్లారపు నాగార్జున, నడ్డి నారాయణ, పురుషోత్తమ చారి, మునిమోహన్ సిద్ధారెడ్డి, దేవరాజులురెడ్డి, కన్నయ్య, అంకమనాయుడు పాల్గొన్నారు.

చరిత్రాత్మకం.. అంబేడ్కర్ మహా విగ్రహం

- అతి ఎత్తైన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై సర్వత్రా హర్షం



స్వరాజ్ మైదానంలో అంబేడ్కర్ విగ్రహం

బంగారుపాళెం: భారతరత్న, అణగారిన వర్గాల ఆశా కిరణం డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 206 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహం ప్రారంభం చరిత్రాత్మకమనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. దళితులను దీదారించుకునే నేతలున్న మన సమాజంలో దళిత, బహుజనుల కోసం అహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి నిలువెత్తు రూపాన్ని జాతికి అంకితం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిపోనుంది. ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నగరం నడిబొడ్డున స్వరాజ్ మైదానంలో 18.18 ఎకరాల విస్తీర్ణంలో అతి తక్కువ సమయంలో చూపరులను ఆకట్టుకునేలా ఆహ్లాదకర ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు.

బడుగులపై ప్రేమకు నిదర్శనం



ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జగన్‌మోహన్‌రెడ్డికి బడుగుల పై ఉన్న ప్రేమకు నిదర్శనం. రాష్ట్రంలో మౌలిక మార్పులే లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగుతోంది. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పాలనలో సముచిత స్థానం కల్పిస్తేనే సాధికారత సాధ్యమవుతోందని భావించి నామినేటెడ్ పోస్టుల్లో ఆయా వర్గాలకు అధిక ప్రాధాన్యం కల్పించారు. అందుకే జగనన్న ఆదర్శ అంబేడ్కర్‌గా కొనియాడుతున్నారు. – చంద్రన్, విశ్రాంత ఎంఈఓ, తగ్గువారిపల్లె, బంగారుపాళెం

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు అభినందనీయం



విజయవాడలో అంబేడ్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహం అభినందనీయం. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ప్రారంభమైనప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తున్నారు. బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతోంది. జగన్ పాలనలో ఆయా వర్గాలకు రాజకీయంగా ఊహించని పదవులు దక్కుతున్నాయి. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఆయా వర్గాలు నేడు అభివృద్ధిబాటలో పయనిస్తున్నాయి. – వరదయ్య, బంగారుపాళెం

అంబేడ్కర్ ఎవరనేది తెలియజేశారు



డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఎవరనే విషయం కొంత మంది ప్రజలకు మాత్రమే తెలుసు. సీఎం జగన్ 206 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి అంబేడ్కర్ ఎవరనేది ప్రపంచానికి తెలియజేశారు. బడుగు, బలహీన వర్గాల నాయకుడు అభివృద్ధిపై జగన్ చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ ఆయన బడుగుల పక్షపాతి అనేందుకు నిదర్శనం. – శేఖర్, దళిత సమాఖ్య అధ్యక్షుడు, బంగారుపాళెం

యువతకు స్ఫూర్తి



అంబేడ్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహ ప్రతిష్ఠ యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. నిలువెత్తు విగ్రహాన్ని చూడగానే అంబేడ్కర్ జీవితంలో కష్టాలను ఎదుర్కొని చదువే ఆయుధంగా చేసుకుని ఉన్నత శిఖరాలకు ఎదిగారనే విషయం గుర్తుకు వస్తుంది. దేశం గర్వించదగ్గ స్థాయికి ఎదిగిన మహోన్నత విగ్రహం బడుగులకు గౌరవ పతకం. యువతలో స్ఫూర్తిని నింపేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేయడం గర్వకారణం. – నవీన్, మండల అంబేడ్కర్ కమిటీ అధ్యక్షుడు, బంగారుపాళెం

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

గుడుపల్లె: ప్రభుత్వం మహిళలకు ప్రవేశ పెట్టిన పథకాలను మహిళలందరూ సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎంపీపీ వరలక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కొడతనపల్లెలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా పథకానికి సంబంధించి స్వయం సహాయక సంఘ సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడారు. కొడతనపల్లె గ్రామ పంచాయతీలో 42 సంఘాల్లోని 420 మంది సభ్యులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.98 లక్షల మంజూరు చేశారని, ఈ సొమ్ముతో ఆర్థికంగా ముందుకుపోవాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమన్నారు. ప్రతి మహిళ స్వంత వ్యాపారాలు, పశుపోషణ కుటుంబ, గ్రూపులుగా ఏర్పడి చిన్న చిన్న పరిశ్రమలను స్థాపించవచ్చన్నారు. జగనన్న చేయూత, ఆసరాలతో పాటు మహిళలకు బ్యాంకు రుణాలు ఇస్తున్నారని, పథకాలను, రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాబు పాల్గొన్నారు.

జోరుగా.. హుషారుగా..



బైరెడ్డిపల్లె: మండలంలోని కొటాలవంకలో ఆదివారం మైలేరు పండుగ జోరుగా సాగింది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాక కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి కూడా ఎద్దులను భారీగా తీసుకువచ్చారు. యువత ఉల్లాసంగా..ఉత్సాహంగా మైలేరు పండుగలో పాల్గొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామస్తులు చర్యలు తీసుకున్నారు.